క్లుప్తంగా

గ్రామాల్లో ముమ్మరంగా దోమల మందు పిచికారీ



పెదవలసలో మలేరియా కేసుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంవో తులసి

గూడెంకొత్తవీధి: మలేరియా నివారణకు ఏసీఎం స్ప్రేయింగ్‌ను ముమ్మరం చేయాలని జిల్లా మలేరియా అధికారి తులసి అన్నారు. మండలంలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ మేరకు పెదవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఎంవో మలేరియా పాజిటివ్ కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఏఎంఓలు సత్యనారాయణ, నీలకంఠం నాయుడు, సబ్‌యూనిట్ అధికారి కన్నబాబు హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ శ్రావణి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

15న మండల సమావేశం



ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనంద రావు అధ్యక్షతన ఆరోజు ఉదయం గం.10.30 లకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

శాంతి కల్యాణ మహోత్సవం రేపు

వై.రామవరం: మండలంలోని వెదురునగరం శివసాయి భువనేశ్వరి ఆశ్రమ దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం చెంచులక్ష్మి ఉగ్రనరసింహుల శాంతికళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు సాయిరామ్ గురుస్వామి చెప్పారు. ఆరోజు ఉదయం గం.7 లకు కళ్యాణ వెంకటేశ్వరుని అభిషేకం, 8గంటలకు సుదర్శన నరసింహహోమం, 10గంటలకు చెంచులక్ష్మి ఉగ్రనరసింహుల శాంతి కళ్యాణం, 11 గంటల అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. లోక కళ్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎయిడ్స్ అనర్థాలపై ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కళాజాత బృంద సభ్యులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అరకు వారపు సంతలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలపై మన్య సీమ కళా బృందం సభ్యులు నాటిక ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బృందం సభ్యులు అచ్చిబాబు, అప్పలరాజు, రామారావు, విశ్వరావు, మూర్తి, భాస్కరరావు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

వి.ఆర్.పురం: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగ రెడ్డి అన్నారు. రేఖపల్లిలో శుక్రవారం జరిగిన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు ఎమ్మెల్యే శిరీషాదేవికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్‌తో చర్చించి, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు రామారావు, మల్లికార్జున రావు, నరసింహారావు, సూర్య ప్రకాష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

రంపచోడవరం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే శిరీషా ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం

అనకాపల్లి: వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి స్వామివారికి సుప్రభాతసేవ, విష్ణు సహస్రనామ అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు కల్యాణం జరిపారు.



యూ.చీడిపాలెంలో మొక్కజొన్న తోట

మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

కోళ్లకు దాణాగా సరఫరా

మార్కెట్‌లో గిరాకీ

కొయ్యూరు: ఒకప్పుడు రబీలో ఎక్కువగా వేరుశనగను వేసే రైతులు ప్రస్తుతం మొక్కజొన్న సాగుపై ఆశక్తి చూపుతున్నారు. కోళ్ల పరిశ్రమకు మొక్కజొన్న దాణాగా వినియోగిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడతో రైతులు జొన్నపంటపై ఆశక్తి చూపిస్తున్నారు. దీని మూలంగా మండలంలో పంట సాగు విస్తీర్ణం 500 ఎకరాల దాటింది.20 సంవత్సరాల కిందట వరకు కొయ్యూరుతో పాటు అనేక గ్రామాల్లో చెరకును ఎక్కువగా సాగు చేసేవారు. బెల్లం తయారు చేసి అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో విక్రయించేవారు.దీని తర్వాత రైతులు ఖరీఫ్‌లో వరి వేస్తే రబీలో వేరుశనగ వేసేవారు. పౌల్ట్రీలో కోళ్లకు దాణగా మొక్కజొన్న వినియోగం బాగా పెరిగింది. దీంతో కొన్నేళ్లుగా రైతులు మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలలోను దీని సాగువుతుంది.



రేవళ్ల రహదారిపై ఎండబెట్టిన మొక్కజొన్న గింజలు

ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి

సాగును అనుసరించి ఎకరాకు 20–24 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది .పొత్తులను తోటల నుంచి కోసి తరువాత వాటిని కొన్ని రోజుల పాటు తొక్కలు వలిచి ఎండబెడతానే. అలా ఎండిన పొత్తుల నుంచి గింజలను యంత్రం ద్వారా వేరు చేస్తారు. దీని అనంతరం గింజలో తేమశాతం తగ్గే వరకు నాలుగైదు రోజుల పాటు ఎండబెడతారు.అనంతరం విక్రయానికి సిద్ధం చేస్తారు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.2 వేలు పలుకుతుంది. రైతులు సాగుకు ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. దిగుబడి ఆధారంగా ఎకరాకు రూ.20 వేల వరకు లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. డిమాండ్ ఉండడంతో ఏటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. కోళ్ల దాణాకు మొక్కజొన్న వినియోగం బాగా పెరిగింది. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వస్తున్నారు.వారి నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఏటా దాణాకు డిమాండ్ పెరుగుతుంది. దీని మూలంగా పంట వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి.

కూలీల కొరత

వలచిన పిక్కలను ఎండబెట్టాల్సి ఉంది. దీని కోసం కూలీలు దొరకడం లేదు. పిక్కలు బాగా ఎండాల్సి ఉంటుంది.బాగా ఎండితేనే వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పనులు సాయం చేసేందుకు కూలీలు దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం పి యేసు, రైతు

సాగుపై సూచనలు, సలహాలు



ఏటా మొక్కజొన్న సాగు పెరుగుతుంది. రైతులు ఎక్కువ మంది ఈ పంటను రబీలో వేస్తున్నారు. కోళ్ల దాణా కోసం మొక్కజొన్నకు బాగా ఉంది. ఏటా పెరుగుతుంది. దీంతో రైతుల మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పంట సాగుపై రైతులకు తగిన సూచనలు ఇస్తాన్నాం. – ఉమాదేవి, ఏవో, కొయ్యూరు

ఆస్పత్రుల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరంలో గర్భిణికి స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారి



చింతపల్లిలోని ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వై.రామవరం:పి.ఎం.ఎస్.ఎం.ఏ.కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం 90 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 17 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. డాక్టర్ రాఖేష్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, ప్రత్యేక వైద్యపరీక్షలు చేశారు.

చింతపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని డాక్టర్ ఎస్ వాసవి అన్నారు. మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో పి.ఎం.ఎస్.ఎం.ఏ. పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య పరిక్షలు నిర్వహించారు. ప్రతి నెల చింతపల్లి జీకే వీధి మండలాల్లో గల గర్భిణులకు 9, 10 తేదీల్లో ఏరియా ఆసుపత్రిలో వైద్య పరిక్షలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం 60 మంది గర్భిణులకు వైద్య పరిక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వాడకంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి వాసవి సూచించారు.

రైతుల వివరాలు నమోదు చేసుకోవాలి

చింతపల్లి: మండలంలోని గిరిజన రైతులు ఈ నెల 16 తేదీ లోగా అన్నదాత సుఖీభవ పథకంలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం ఈ పథకం ద్వారా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం ప్రారంభమైనట్టు తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారుల రైతులు తమ పాసుపట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, పోడుపట్టా వివరాలతో రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్త చిన్నారి ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర వికాస వేసవి శిబిరాలు నిర్వహించారు. మహిళలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు సుశీల, లలిత, స్థానిక గిరిజన మహిళలు ఛాయాదేవి, వసంత, కుమారి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో భారీ వర్షం

పెదబయలు: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత ఉండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి మధ్యాహ్నం వర్షం పడి వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఒకే రోజు భిన్న వాతావరణం ఉండడంతో ఈ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. కుండపోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరారు.



పెదబయలులో కురుస్తున్న భారీ వర్షం


పసుపు సేకరణలో రైతుల ఇక్కట్లు

మండలంలోని మారుమూల గ్రామాల్లో ఇప్పుడిప్పుడే రైతులు పసుపును సేకరిస్తున్నారు. అకాలవర్షాల వల్ల పసుపు సేకరణకు ఇబ్బందిగా మారింది. వర్షాలు కురుస్తుండంతో పసుపు మెలకెత్తుతుందని, దీంతో ఈ ఏడాది పసుపు సేకరణకు ఇబ్బందిగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వీర జవాన్ మురళీనాయక్ మృతికి సంతాపం

పాడేరు రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో యుద్ధభూమిలో పాకిస్తాన్‌తో పోరాడుతూ సత్యసాయి జిల్లా పెన్నుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డంతాండ పంచాయతీ కళ్లితాండ గ్రామానికి చెందిన జవాన్ మురళీనాయక్ వీర మరణం పొందడం బాధాకరమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుస ఉమామహేశ్వరరావు చెప్పారు, అనంతరం ఆయన మాట్లాడుతూ వీర జవాన్ మురళీనాయక్ చూపించిన ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణమన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు తదితరులు నివాళులర్పించారు.

మన్యంలో విభిన్న వాతావరణం



డుంబ్రిగుడలో ఉదయం కురుస్తున్న మంచు



వారపు సంతలో మధ్యాహ్నం ఎండ తీవ్రత

డుంబ్రిగుడ: మండలంలోని ఉదయం మంచు తెరలు కమ్ముకుంది. దీంతో ప్రయాణికులు వారపుసంతకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఉదయం పూట మంచు కమ్ముకుంటుంది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వారపుసంతకు వచ్చే గిరిజనులు చెట్ల నీడన సేదతీరుతున్నారు. మండలంలో వింత వాతావరణంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ వల్లంగుల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచ్ సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ గెమ్మెలి అప్పారావు ప్రారంభించారు. వల్లంగుల గ్రామంలో 170 మీటర్లు సీసీ రోడ్డుకు రూ.8లక్షలు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోతి, మాజీ వార్డు సభ్యుడు రాజుబాబు, గ్రామపెద్దలు చంటిబాబు, కృష్ణారావు, నూకరాజు, సోలమాన్‌రాజు, డేవిడ్‌రాజు తదితరలు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



గోపవరంలో దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం /గంగవరం: ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా తామరపల్లి పంచాయతీ గోపవరం గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్టు ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు కుంజం వంశీ చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్ర వద్ద ఏర్పాటు చేసిన కిశోర బాలికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాల్య వివాహాలు, కౌమారదశ గర్భధారణ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వార్డ్ సభ్యులు బాపన్నమ్మ, గంగా, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి , వీవోఏ రామతులసి, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా పోతురాజు బాబు స్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేకాలంకరణలో పోతురాజుబాబు విగ్రహం



పూజలు చేస్తున్న భక్తులు

గంగవరం : మండల కేంద్రమైన గంగవరంలో గడి పోతురాజు బాబు స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు నిర్వహించే స్వామి వారి జాతర మహోత్సవాలు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి విగ్రహాన్ని వివిధ రకాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి పున్యావచనం, గణపతి హోమం, శాంతి హోమం, నవగ్రహ హోమాలు ఘనంగా నిర్వహించారు. తొలుత పోతురాజుబాబు స్వామి వారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద పండితులు లంక అయ్యప్పస్వామి బృందం వేదపండితులు వేదమంత్రాల నడుమ స్వామివారి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ హెచ్ఎం ఎస్.ఎం. పట్నాయక్ మాస్టారు, వీఓ లీడర్ రమణమ్మ రామారావు, గంగవరం ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు దొర , శివగణేష్, భవానీ దంపతులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు వై.రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు దొర, మాజీ సర్పంచులు కుంజం వెంకటేశ్వర్లు దొర , కె.సిద్దూ, ఎం.వెంకటరమణ, ఆలయ కమిటీ మహిళలు వై.రాణి, ఎస్.రామాయమ్మ, పి.రామాయమ్మ, మల్లమ్మ, వెంకటరమణమ్మ, నాగమణి, యూత్ కమిటీ యువకులు, భారీగా భక్తులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సాగర పంచాయతీలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి జడ్జి రాము



కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన యువత

డుంబ్రిగుడ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అరకులోయ కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎ.రాము అన్నారు. మండలంలోని సాగర పంచాయతీలో యువతకు కేరీర్ గైడెన్స్ ఇతర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి అనర్థాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి కేసులో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. న్యాయవాదులు రాంబాబు, రత్నంరాజు, సాగర ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, సీతారం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబసభ్యులకు చెక్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజవొమ్మంగి: మండంలోని లాగరాయి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు పూసం సత్యనారాయణ కుటుంబానికి యూటీఎఫ్ సభ్యులు ఆర్థిక సాయమందించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటుచేసిన సంతాప సభలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు ఫెడరేషన్ తరపున లక్ష రూపాయల చెక్కును శుక్రవారం అందజేశామన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. మృతుడు సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో యూటీఎఫ్ నాయకులు కృష్ణ, మహేష్, ఆదిరెడ్డి, పైడిమల్లు, శ్రీను, వెంకటలక్ష్మి తదితరులున్నారు.

పత్రికా స్వేచ్ఛను అణచివేయడం దారుణం



ముంచంగిపుట్టులో తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



అడ్డతీగలలో డిప్యూటీ తహసీల్దార్ తేజస్వినికి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

ముంచంగిపుట్టు: ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా ప్రవేశించి సోదాలు చేయడాన్ని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసులు ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు నిరసన ప్రదర్శనలు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో పలువురు విలేకరులు మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసు సోదాలు నిర్వహించడం పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. దీన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం అందజేశారు. మండల పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు సురేష్, దుర్గారావు, భూషణ్‌రావు, రమణ. ఈశ్వర్, శ్రీను, మోహన్, అనీల్, పులిరాజ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడంపై అడ్డతీగలలో పాత్రికేయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు పాత్రికేయులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ తేజస్వినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ పత్రికల్లో వాస్తవాలు వస్తే పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఇటువంటి చర్యలకు దిగడం సరికాదన్నారు. పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. పాత్రికేయులు లోవరాజు, శ్రీధర్, కేశవరెడ్డి, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



వి.ఆర్.పురంలో తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ రామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

వి.ఆర్.పురం; పత్రికా స్వేఛ్ఛకు విఘాతం కలిగించేలా పోలీసు వర్గాల వ్యవహార శైలి ఉందని స్థానిక పాత్రికేయులు ఆవేదన వ్యక్తం వేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు అక్రమంగా చొరబడి సోదాలుచేయడం పత్రికే స్వేచ్ఛను హరించడమేనన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు ఎక్కెల నాగేంద్రబాబు, ధన్నాన రామారావు, కప్పల కృపారావు, గోలి వికాష్, ముత్యాల సాయిబాబు, కోట్ల నరేష్, యడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.